

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన 'అమ్మ ఆదర్శ పాఠశాల' నిర్మాణం పనులు


నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | MEDAK




తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఏలియన్స్ సంస్థ నిర్మించిన బహుళఅంతస్తులు

# నిధులున్నా..పనులు సున్నా



నిజాంపేట మండలం మేఘ్యానాయక్ తండాలో ఈజీఎస్ పనులతో ప్రారంభించి అర్ధంతరంగా నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణం



సిర్గాపూర్ మండలం జమ్లా నాయక్ తండాలో అసంపూర్తిగా మిగిలిన పంచాయతీ భవన నిర్మాణం

- పాఠశాలల్లో ముందుకు సాగని ఈజీఎస్ పనులు
- పెండింగ్‌లో రూ.95.83 కోట్ల పనులు
- ప్రారంభానికి నోచుకోని బాలికల పాఠశాలల టాయిలెట్ల పనులు
- ఇబ్బందుల్లో సర్కారు విద్యార్థులు
- సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు సైతం ఆలస్యం
- పట్టించుకోని సంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం

సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ):ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొంది. కేసీఆర్ ప్రభుత్వం పాఠశాలల ఆధునీకరణకు పెద్దపీట వేసింది.'మనఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా సంగారెడ్డి జిల్లాలోని 441 ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు చేపట్టింది. రూ.36.90 కోట్లతో 363 గ్రామీణ, 78 పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులకు కేసీఆర్ సర్కార్‌లో శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనపై పెద్దగా దృషి పెట్టడం లేదు. 'మనఊరు-మనబడి' స్థానంలో కొత్తగా 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' పేరుతో కార్యక్రమం ప్రారంభించినా పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు నిధులు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా నిధులు ఇచ్చినా పనులు చేపట్టడం లేదు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా చెప్పుకొంటున్న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు ఈజీఎస్ ద్వారా నిధులు ఇచ్చినా జిల్లాలో పనులు ప్రారంభం కావడం లేదు. బాలికల పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి రూ.6.09 కోట్ల నిధులు ఇచ్చినా జిల్లా యంత్రాంగం ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. అధికారుల సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీలు, కిచెన్‌షెడ్‌లు, టాయిలెట్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) కింద రూ.45.68 కోట్లతో 446 పనులు మంజూరు చేశారు. 132 పాఠశాలల్లో రూ.14.08 కోట్లతో ప్రహరీల నిర్మాణం, రూ.1.22 కోట్లతో కిచెన్‌షెడ్ల నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా పనులు మంజూరయ్యాయి. రూ.4.29 కోట్లతో 94 టాయిలెట్ల నిర్మాణ పనులు ఈజీఎస్‌లో చేపట్టాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు ఈ పనులు ప్రారంభం కాలేదు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పరిధిలోని బాలికల పాఠశాలల్లో 174 టాయిలెట్ల నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ.6.09కోట్లు విడుదల చేశారు. దీంతో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అటకెక్కిన సీసీ రోడ్ల నిర్మాణం...**

సంగారెడ్డి జిల్లాలో ఈజీఎస్ ద్వారా మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సైతం మోక్షం లభించడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో ఈజీఎస్ ద్వారా రూ.70.15 కోట్లతో 824 సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఈ పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఇంజినీరింగ్ అధికారుల అలసత్వం కారణంగానే ఈ పనులు అటకెక్కాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈజీఎస్ ద్వారా జిల్లాలోని రూ.8.4 కోట్లతో 105 అంగన్‌వాడీ భవనాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ పనులు సాగడం లేదు.

### పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ.95.83 కోట్లతో 1270 పనులు మంజూరయ్యాయి. వేర్వేరు కారణాలతో పనులు ఆశించిన స్థాయిలో వేగంగా సాగడం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 446 పనులు, 824 సీసీ రోడ్డు నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–జ్యోతి, డీఆర్‌డీవో సంగారెడ్డి

# మేళ్ల చెరువును మింగేస్తుండ్రు..!

- మేళ్ల చెరువుపై హైడ్రా దృష్టి సారించేనా..
- చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జోరుగా నిర్మాణాలు
- చెరువుని పరిరక్షించాలని కోరుతున్న సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ గ్రామస్తులు



తెల్లాపూర్ మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన నివీ గార్డెన్ విల్లాలు

రామచంద్రాపురం, సెప్టెంబర్16: రియల్టర్ల స్వార్థ ప్రయోజనాలు చెరువులకు శాపంగా మారుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా చెరువులు, కుంటలను ఆక్రమించి వెంచర్లు చేస్తూ అమాయక ప్రజలతో చెలగాటమాడుతున్నారు. దీంతో ప్రకృతి విపతులు సంభవించినప్పుడు సాధారణ ప్రజానీకం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఎన్నో కుటుంబాలకు నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితులకు కారణం చెరువులు, కుంటలు కబ్జాలకు గురికావడమే కారణం అని చెప్పవచ్చు. చెరువులు, కుంటలకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలకు పాల్పడుతూ వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. చెరువుల పరిరక్షణే ధ్యేయం అంటూ కాంగ్రెస్ సర్కార్ హైడ్రాను తీసుకువచ్చింది. కానీ, హైడ్రా పేదల ఇండ్లపైనే బుల్డోజర్‌లతో తమ ప్రతాపం చూపిస్తున్నది. బడా నిర్మాణ సంస్థలవైపు వెళ్లడం లేదనే విమర్శలు ఉన్నాయి. గరీబోళ్లు వేసుకున్న గుడిసెలను కూల్చుతూ వారికి నీడను లేకుండా చేస్తున్నది. కూల్చే ముందు నోటీసులు కూడా ఇవ్వడం లేదని హైడ్రా తీరుపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నది.కానీ, ప్రభుత్వం పేదలు, పెద్దలు అని చూడకుండా అందరికీ ఒకటే న్యాయం, చట్టం అనేలా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

**మేళ్ల చెరువుపై హైడ్రా దృష్టిసారిస్తుందా..?**

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మేళ్ల చెరువు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు మేళ్ల చెరువు శిఖం 27ఎకరాలు, చెరువుకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్ సుమారుగా 100ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. గతంలో గ్రామస్తులు చెరువులోనే స్నానాలు చేసేవారు. అవే నీటిని తాగేవారు. అలాంటి స్వచ్ఛమైన చెరువు మనుగడ ఇప్పుడు దయనీయంగా మారింది. చెరువు చుట్టూ బహుళ అంతస్తులు, విల్లాలు నిర్మాణం కావడంతో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు, వరద కాల్వలు ఆక్రమణకు గురయ్యాయి. డ్రైనేజీ నీరు చెరువులోకి చేరి కలుషితమవుతున్నది. ఆక్రమణలతో రోజురోజుకు చెరువు కుదించుకుపోతున్నది. మేళ్ల చెరువు పరిరక్షణకు కొందరు గతంలో ఎన్‌జీటీలో కేసులు వేశారు. ఎన్‌జీటీ బృందం తెల్లాపూర్‌లో పర్యటించి నిర్మాణాలు కూల్చివేయాలని ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తెల్లాపూర్‌కు జలవనరుగా ఉన్న మేళ్ల చెరువు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా హైడ్రా మేళ్ల చెరువుపై దృష్టిసారించి ఎఫ్‌టీఎల్, బఫర్‌లోని ఏలియన్స్, నివీగార్డెన్, సంకల్ప తదితర నిర్మాణాలపై చర్యలు తీసుకొని చెరువుని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.




సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మేళ్ల చెరువు గూగుల్ చిత్రం

### ఎన్‌వోసీలను రద్దు చేశాం..

మేళ్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జరిగిన నిర్మాణాలకు సంబంధించి వాటికి ఉన్న ఎన్‌వోసీలను ఎన్‌జీటీ ఆదేశాల మేరకు రద్దు చేశాం. ఆ తర్వాత ఏ నిర్మాణ సంస్థకు కూడా ఇరిగేషన్ వైపు నుంచి ఎలాంటి ఎన్‌వోసీలు జారీ చేయలేదు. మేళ్లచెరువుకి సంబంధించిన వివరాలు ఎన్‌జీటీకి, హైకోర్టుకు గతంలోనే సమర్పించాం. ప్రస్తుతం కొత్త నిర్మాణాలు ఏవి మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జరగడం లేదు. ఎవరైనా కొత్తగా ఎఫ్‌టీఎల్, బఫర్‌లో నిర్మాణాలకు పాల్పడితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

– సంతోషి, ఇరిగేషన్ ఏఈ

### మేళ్ల చెరువును కాపాడాలి..

మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జరిగిన నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకొని చెరువుని కాపాడాలి. ఇటీవల హైడ్రా కార్యాలయానికి వెళ్లి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెరువులు, కుంటల ఆక్రమణపై ఫిర్యాదు చేశాం. హైడ్రా సామాన్యులపైన పంజా విసరడం కాకుండా ఒకసారి తెల్లాపూర్‌లోని చెరువుల వద్దకు వచ్చి చూస్తే తెలుస్తుంది. బహుళ అంతస్తులు, విల్లాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో నిర్మించినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనిపైన హైడ్రా వెంటనే స్పందించి చర్యలు తీసుకొని ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నాం.

- నర్సింహులు, సాగునీటి సంఘం మాజీ చైర్మన్, తెల్లాపూర్

# రైల్వే అండర్ పాస్ కోసం సర్వే

## అభ్యంతరం వ్యక్తం చేసిన నాగిరెడ్డిపల్లి రైతులు

కోహీర్, సెప్టెంబర్16: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి, వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న 20వ రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మించేందుకు సోమవారం రైల్వే, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. రైల్వే గేటును మూసివేసేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. దీంతో రైలు పట్టాల అవతల ఉన్న రైతులు నాగిరెడ్డిపల్లి గ్రామానికి వచ్చేందుకు రైల్వే అండర్ పాస్ ద్వారా రాకపోకలను సాగించాల్సి ఉంటుంది. సర్వే నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న గ్రామ రైతులు అధికారుల వద్దకు వచ్చి వారిని నిలదీశారు. రాజనెల్లి-పీచెర్యాగడి గ్రామాల మధ్య రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కానీ వర్షాకాలంలో నీరు నిండి కుంటలా తయారు అవుతుందన్నారు. వర్షాకాలంలో పీచెర్యాగడి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. బైకులు, కార్లు రైల్వే అండర్ పాస్‌లోని నీటిలో మునిగిపోయే అవకాశం ఉందన్నారు. రైల్వే అధికారులు పనులను వెంటనే నిలిపివేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, సర్వేయర్ నర్సింహులు, రైల్వే అధికారులు, మాజీ సర్పంచ్ అంజయ్య, మొగులయ్య, టంటం శ్రీనివాస్, పాల్గొన్నారు.

**ఎవరూ పట్టించుకోవడం లేదు..**

రైల్వే గేటును మూసివేసి పట్టాల కింద నుంచి రోడ్డు వేస్తామని రైల్వే అధికారులు అంటున్నారు. మా చేను మధ్యలో నుంచి రైలు పట్టాలు ఉన్నాయి. రైలు పట్టాల కింద నుంచి రోడ్డు వేస్తే మళ్లీ మా భూమి పోతుంది. మాకు నష్టపరిహారం ఎవరు ఇస్తరు. మా పట్టా భూమిలో సర్వే చేస్తే ఎట్లా. పనులు ఆపాలని ఎంతమందికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– కృష్ణారెడ్డి, రైతు, నాగిరెడ్డిపల్లి





కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి వద్ద సర్వే చేస్తున్న రైల్వే, రెవెన్యూ అధికారులు (ఇన్‌సెట్‌లో) అధికారులను నిలదీస్తున్న రైతులు




సీఎం రేవంత్‌పై రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# సీఎం రేవంత్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నంగునూరు, సెప్టెంబర్ 16: సీఎం రేవంత్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కొంతకాలంగా బహిరంగ సభల్లో, ప్రెస్‌మీట్లలో, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలపై అసభ్యపదజాలంతో మాట్లాడడం సిగ్గుచేటని సిద్దిపేట జిల్లా నంగునూరు మండల బీఆర్‌ఎస్ యువజన నాయకులు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా అంతు చూస్తాం, మగాడివి అయితే రా చూసుకుందాం, నన్ను ముట్టుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు మానవబాంబులై మీ అంతు చూస్తారు అనడం సరికాదన్నారు. లాగులో తొండలు చొర్రిస్తాం, పేగులు మెడలో వేసుకుంటాం బిడ్డ, మీ గుడ్లు పీకి గోలీలు ఆడుకుంటాం అని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారన్నారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన మీటింగ్‌లో సంకనాకనికి పోయింద్రా అంటూ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను అనడంపై మండిపడ్డారు. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై వ్యక్తిగతంగా మాట్లాడడం వల్ల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటల వల్ల యువకులు, విద్యార్థులు ప్రేరేపితమై అవాంఛనీయ సంఘటనలు జరిగే ప్రమాదం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే భాష మార్చుకోవాలని, తాను మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆకుబత్తిని రాము, అనగోని పరశురాములు, తప్పెట పరశురాములు, చింటూ, ఇమ్రాన్, అనిల్ రెడ్డి, పరశురాములు, కాటం రాజు, నరేశ్, బాలరాజు, హరిబాబు, రాజు పాల్గొన్నారు.

**సీఎంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి**

చిన్నకోడూరు, సెప్టెంబర్ 16: మాజీమంత్రి, సిద్దిపేట శాసన సభ్యుడు తన్నీరు హరీశ్‌రావుపై గాంధీ భవన్‌లో అనుచిత వాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణకు బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు గుండెల్లి వేణు, బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు ఆధ్వర్యంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలు, సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై అసభ్య పదజాలంతో మాట్లాడటం తెలంగాణ సంప్రదాయాలకు భిన్నమని హెచ్చరించారు. కార్యక్రమంలో మిట్టపల్లి సుధాకర్, పడిగే లింగం, మన్నే ఆనంద్, భానుచందర్, రాజశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, ప్రేమ్, జగన్ తదితరులు ఉన్నారు.



చిన్నకోడూరు ఎస్సై బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ మండల నాయకులు



ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

# అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

**మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 16: అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందని తెలిపారు.

# గణనాథుడి శోభాయాత్రకు సర్వం సిద్ధం

- సంగారెడ్డిలో 1200మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు
- ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, సెప్టెంబర్16: వినాయకుల నిమజ్జనాల శోభాయాత్రకు అంతా సిద్ధం చేశామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మంగళవారం అన్ని పట్టణాలు, గ్రామాల్లో గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి అందుబాటులో పోలీసు బలగాలు ఉంటాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రత్యేకంగా జిల్లాలో 1200 మంది పోలీసులతో ప్రత్యక్ష బందోబస్తు ఏర్పాటు చేశామని, గణేశ్ శోభాయాత్ర వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు లేకుండా సంబంధిత శాఖల సమన్వయంతో తొలిగించామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా రోడ్డు డైవర్షన్ చేశామని, పలు ప్రధాన కూడళ్లలో మసీదులు, దర్గాలు, చర్చిలపై రంగులు(గులాల్)పడకుండా ఎత్తయిన బారికెడ్లతో పాలితిన్ కవర్లు ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్రను వీక్షించడానికి వచ్చే ప్రజలు, భక్తలకు అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసి ప్రజలకు పోలీసుల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద నీళ్లలోకి దిగకుండా బారికెడ్లు ఏర్పాటు చేయించామని, విగ్రహాలను నిమజ్జనానికి క్రేన్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడానికి గజ ఈతగాళ్లు అందుబాటులో ఉన్నారన్నారు. డీఎస్పీ స్థాయి అధికారితో డివిజన్ల వారీగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడం, గణేశ్ ఉత్సవ్ కమిటీ, మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ సూచించారు. శాంతియుతంగా శోభాయాత్ర కొనసాగించడానికి ప్రజ లు, భక్తులు సహకరించాలని, గుంపుగా చేరి తే అదుపు చేసేందుకు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ సిద్ధంగా ఉంటాయన్నారు.

# రాజీవ్‌గాంధీకి తెలంగాణకు సంబంధమేంది..?

## సిద్దిపేటలో అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నేతల నిరసన

సిద్దిపేట, సెప్టెంబర్ 16: తెలంగాణకు రాజీవ్‌గాంధీకి సంబంధమేందని, ప్రభుత్వం సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని బీఆర్‌ఎస్‌వీ నాయకులు మేర్గు మహేశ్‌రెడ్డి యాదగిరి, కంకటి నవీన్‌గౌడ్ అన్నారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సమాజం యావత్తు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టవద్దన్నా, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన మహనీయుల విగ్రహం, తెలంగాణకు చెందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహాన్ని పెట్టాలన్నారు. కాంగ్రెస్ అగ్రనేతల మెప్పు కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేనన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక కూల్చివేయక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్రీకాంత్, అరవింద్‌రెడ్డి, గుజ్జ రాజు, శ్రీనివాస్, బైండ్ల శ్రీనివాస్, ఆనంద్, భాను, రాజశేఖర్, అశోక్, రాకేశ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్తూపం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ, తెలంగాణ తల్లి ప్రతిమకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు




నీటినిల్వతో కళకళలాడుతున్న మల్లన్న సాగర్

# మల్లన్న సాగర్ @ 18.90 టీఎంసీలు

తొగుట, సెప్టెంబరు 16: సాగు నీటి గోస తీర్చడానికి అపర భగీరథుడు కేసీఆర్ హయాంలో నిర్మించిన మల్లన్నసాగర్ ప్రాజెక్టులో నీటి నిలువ ఈ ఏడాది 18.90 టీఎంసీలకు చేరుకుంది. గతేడాది 16.20 టీఎంసీల నీటిని నింపగా ఈసారి 18.90 టీఎంసీల వరకు నీటిని నింపారు. గతంలో ఉన్న 16.20 టీఎంసీల నీటిలో 5.80 టీఎంసీల నీటిని కొండపోచమ్మ సాగర్‌కు తరలించగా, ఈ సంవత్సరం ఎత్తిపోతల ద్వారా 10.40 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో ప్రస్తుత నీటి నిల్వ 18.90 టీఎంసీలకు చేరింది. మల్లన్న సాగర్‌లో నీటి నిల్వ మూలంగా ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు సరిహద్దు జిల్లాలైన ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్, హైదరాబాద్ తదితర జిల్లాలకు సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీరనున్నాయి. వాస్తవానికి ప్రాజెక్టులో 21 టీఎంసీల నీటిని నిల్వ చేసే ఉద్దేశంతో ఎత్తిపోతల కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాంసాగర్ ద్వారా వస్తున్న వరదను మిడ్ మానేరులో నిల్వ చేసి అక్కడి నుంచి అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ద్వారా మూడు అంచెల ఎత్తిపోతలను నిర్వహించారు.

# కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

పుల్కల్, సెప్టెంబర్ 16: సంగారెడ్డి జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రాజెక్టు పూర్తిగా నిండింది. ఎగువన కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి వరద వస్తుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్టుగానే దిగువన ఉన్న విద్యుత్ జెన్కోకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో విద్యుత్ అధికారులు రెండు టర్బైన్ల ద్వారా ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి జలవిద్యుత్ కేంద్రానికి రోజూ 2,363 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో ఇప్పటి వరకు 3,962 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. 2023-24లో 10.77 మిలియన్ యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి నమోదైనట్లు జెన్‌కో సీఈ రమేశ్‌బాబు వెల్లడించారు. ఈ ఏడాది 15 నుంచి 20 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టులోకి 1887 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 3612 క్యూసెక్కులు వెళ్తున్నట్లు, ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీటి నిల్వ 29.469 టీఎంసీలు ఉందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి వెల్లడించారు.



జలకళను సంతరించుకున్న సింగూరు

# విద్యుత్ తీగల కింద నాటుతున్న మొక్కలు

గుమ్మడిదల, సెప్టెంబర్ 16: గుమ్మడిదల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కూలీలతో మొక్కలు నాటిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నాటుతున్న మొక్కల పైభాగంలో విద్యుత్ తీగలు ఉండడంతో భవిష్యత్‌లో చెట్టుగా ఎదిగిన తర్వాత విద్యుత్ సరఫరాకు అంతరాయం వస్తుందని నరికేయాల్సి వస్తుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గుమ్మడిదల మండల కేంద్రంలో ఎంపీఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న లింక్ రోడ్డులో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మొక్కలను నాటుతున్నారు. వీటి పైభాగంలో 11కేవీ విద్యుత్ తీగలు ఉండడంతో భవిష్యత్తులో ఇబ్బందుల తప్పవు.



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో 11కేవీ విద్యుత్ తీగల కింద మొక్కలను నాటుతున్న కూలీలు